# బంగ్లాదేశ్ ఆర్థిక సంక్షోభం

# దక్షిణాసియా దేశాలకు ప్రపంచబ్యాంకు చూపే 'గ్రీనర్ ఎకానమీ' పరిష్కారం

**దక్షిణాసియా** దేశాలలో శ్రీలంక, పాకిస్తాన్‌ల ఆర్థిక సంక్షోభం తర్వాత బంగ్లాదేశ్, మయన్మార్‌లలో పెరుగుతున్న సంక్షోభాల గురించి, రష్యా ఉక్రెయిన్‌ల యుద్ధం కారణంగా ఆ దేశాల ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాల గురించి వార్తలు వస్తున్నాయి. ఆర్థిక సంక్షోభాల నుంచి తాత్కాలికంగా బయటపడేందుకుగానూ దిగుమతులు చేసుకునే వాటిని తగ్గించుకోవాలని ఒక్కొక్క దేశపు పాలకులు ఒక్కొక్కరకంగా ప్రజలకు పొదుపు చిట్కాలు సూచిస్తున్నారు. పాకిస్థాన్‌లో టీలు, కాఫీలు మానేయాలంటే బంగ్లాదేశ్‌లో విదేశీ ప్రయాణాలు తగ్గించుకోవాలంటున్నారు. శ్రీలంకలో పాలకులు కాస్త కిందికి దిగి ప్రభుత్వ ఉద్యోగులు వారంలో మూడు రోజులు రైతుల దగ్గరికెళ్ళి వ్యవసాయం చేయడంలో సహకరించమని వారికి సెలవులు ఇచ్చారు. విదేశాలకు వెళ్లదల్చుకున్న ఉద్యోగులకు జీతం లేని దీర్ఘకాలిక సెలవులు ప్రకటించారు. వ్యవసాయ రంగం తప్ప వారిని ఈ స్థితిలో మరేదీ కాపాడలేదని తెలిసినా కూడా తాము అప్పుల ఊబిలో నుంచి బయటపడేసేందుకు ఐఎంఎఫ్ తప్ప వేరే దిక్కు లేదని సాగిలపడుతున్నారు.

నిజానికి కోవిడ్ సంక్షోభం తర్వాత, యుద్ధ నేపథ్యంలో ప్రపంచంలోని చాలా దేశాలు రకరకాలుగా సంక్షోభ భారాన్ని ప్రజలపై మోపుతున్నాయి. ఇవి కొత్తగా వచ్చిన ఆర్థిక సంక్షోభాలు కాదు. గతం నుంచీ కొనసాగుతూ పతన దశలో ఉన్నవే. కోవిడ్‌తో సహా సామ్రాజ్యవాదులు పనిగట్టుకుని తెచ్చిన రెండు యుద్ధాల విషమ పరిణామాల తర్వాత ఈ విధంగా సంక్షోభాలు బద్దలయ్యాయని అర్థం చేసుకోవాలి. తనకు తాను ఎదురులేని ఆర్థిక, సైనిక శక్తిగా చెప్పుకునే అమెరికా 30 సంవత్సరాల గరిష్ట ద్రవ్యోల్బణంతో తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని, తత్ఫలితంగా తన సొంత ప్రజల వ్యతిరేకతను మూటగట్టుకుంది. అమెరికన్ పాలకవర్గాల ఆయుధ వ్యాపారం, ఆధిపత్య వ్యూహంలో భాగంగా సృష్టించబడిన ఉక్రెయిన్, రష్యా యుద్ధ ప్రభావాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ అతలాకుతలమౌతున్నాయి.

**బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థ :**

పెద్దపెద్ద విదేశీ ప్రాజెక్టులకు, మితిమీరిన విదేశీ అప్పులకు పరుగులు తీయక ముందు శ్రీలంక, బంగ్లాదేశీయుల తలసరి ఆదాయాలు, మానవాభివృద్ధి సూచికలు భారతదేశం కన్నా మెరుగ్గానే ఉన్నాయి.

బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా పారిశ్రామిక ఉత్పత్తులైన రెడీమేడ్ దుస్తులు, జూట్ ఉత్పత్తులు, టీ, కాఫీ ఉత్పత్తులు, ఆటోమొటివ్స్, షిప్పుల నిర్మాణ రంగం తదితర ఎగుమతుల పైన ఆధారపడి ఉంటుంది. ప్రధానంగా యూరప్ దేశాలు, అమెరికా, గల్ఫ్ దేశాలతో వ్యాపార సంబంధాలు ఉంటాయి. ఇస్తాంబుల్ కేంద్రంగా పనిచేసే D-8 దేశాల అభివృద్ధి సహకార కూటమిలో బంగ్లాదేశ్ భాగస్వామిగా వుంది. అనేక మూడవ ప్రపంచ దేశాలవలె విదేశీ మారక ద్రవ్యం విషయంలో ఎగుమతులతోపాటు తమ దేశం నుంచి సంపాదన కోసం విదేశాలకు వెళ్ళి తినీతినక డాలర్లను (రెమిటెన్సెస్) పొదుపు చేసి స్వదేశానికి పంపుకునే ఉద్యోగులు, శ్రామికుల పైనే ఎక్కువగా ఆధారపడుతున్నది. వర్తమాన ఆర్థిక సంక్షోభంతో ఎగుమతులు తగ్గి దిగుమతుల పెరిగిన కారణంగా వాణిజ్య లోటు ఏర్పడింది. తీసుకున్న అప్పులకు కిస్తీలు, వడ్డీలు కూడా కట్టలేని స్థితి ఏర్పడింది.

2020 నాటికి బంగ్లాదేశ్ జిడిపి 32,423.92 అమెరికన్ డాలర్లు. ఇందులో పారిశ్రామిక రంగం వాటా 29.54 శాతం. సేవారంగం వాటా 53.40 శాతం. వ్యవసాయ రంగం వాటా 12.91 శాతం. 16 కోట్లకు పైగా ఉన్న ఈ దేశ జనాభాలో 20.5 శాతం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని, 52.3 శాతం మంది రోజుకు 3.20 డాలర్ల కన్నా తక్కువ ఆదాయం పొందుతున్నారని ఆ దేశ గణాంకాలు చెపుతున్నాయి. ఆ దేశంలో శ్రమ చేయగలిగే వాళ్ళలో 43.6 శాతం మంది వ్యవసాయ రంగంలోనూ, 20.4 శాతం మంది పరిశ్రమల్లోనూ, సేవా రంగంలో 39.6 శాతం మంది పని చేస్తున్నారు.

బంగ్లాదేశ్ 2021-22 ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో 1.52 బిలియన్ డాలర్ల మొత్తంలో సరుకులను దిగుమతి చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంతో పోల్చుకుంటే 43.9 శాతం దిగుమతులు పెరిగాయి. గడిచిన ఎనిమిది నెలల్లో 6 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఖర్చయి పోగా బంగ్లాదేశ్ వద్ద 42 బిలియన్ డాలర్లు మాత్రమే మారక ద్రవ్యం నిల్వలున్నట్టు ఆ దేశ ఆర్థిక శాఖ లెక్కలు చెపుతున్నాయి. 2021 సం॥ మొదటి నాలుగు నెలల్లో 7 బిలియన్ల పొదుపు డాలర్లు బంగ్లాదేశ్‌లో జమ అయితే 2022 మొదటి నాలుగు నెలల్లో 20 శాతం తగ్గింది. తగ్గిన ఈ పొదుపు డాలర్ల రూపంలో వచ్చే విదేశీ మారక ద్రవ్యం వ్యక్తుల ఆదాయంతో ముడిపడినది. ఇదే పెట్టుబడిదారీ సంక్షోభాన్ని అర్థం చేసుకోవడానికి పనికి వచ్చే అంశం.

ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో శ్రమిస్తున్న శ్రామికులు, ఉద్యోగులు వారివారి ఉద్యోగాలు, ఉపాధులు కోల్పోవడమో, లేక జీతభత్యాలు తగ్గడమో జరిగింది. ఇది సర్వవ్యాపిత సంక్షోభం

కనుక అన్నిదేశాల్లోనూ ప్రజల జీవన వ్యయాలు, అన్నిరకాల ఖర్చులు పెరగటంతో వారి నిజ వేతనాలు తగ్గిపోయాయి. అంటే శ్రమదోపిడీ పెరిగింది. విదేశాల్లో వారి ఇక్కట్లు మరింత పెరుగుతున్నాయి. ఏ దేశాల పాలకులైనా బడా పారిశ్రామికాధిపతులకిచ్చే రాయితీలలో ఒక్క శాతం కూడా ఈ విదేశీ మారక ద్రవ్యం సంపాదించే వారి బాగోగులకు ఖర్చు చేయడానికి సిద్ధపడడం లేదు. దేశం కాని దేశంలో కష్టాలకోర్చి బతుకుతూ, ఒకవేళ చనిపోతే వారి శవాలను స్వదేశానికి తరలించడానికి ప్రభుత్వాలు ఒక్క పైసా కూడా ఖర్చు చేయటం లేదు. అదే చేతులతో పారిశ్రామికాధిపతుల ప్రయోజనాల కోసం లక్షల ఎకరాల భూములను వారికి ధారాదత్తం చేస్తున్నారు.

**బంగ్లాదేశ్‌లో ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు :**

కోవిడ్ కాలంలో పెరిగిన ద్రవ్యోల్బణం ఈ యుద్ధ కాలంలోనూ కొనసాగుతోంది. 2022 ఫిబ్రవరి నాటికి 6.2 శాతం ద్రవ్యోల్బణం ఇంకా కొనసాగుతోంది. యుద్ధ నేపథ్యంలో అంతర్జాతీయంగా పెరిగిన అనేక రకాల ఇంధన ధరలు పరిస్థితిని ఇంకా దిగజార్చాయి. వంటనూనెలు, గోధుమలు, ఇతర ఆహార పదార్థాల ధరలు బాగా పెరిగిపోయాయి. దేశీయ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసి IMF, ప్రపంచ బ్యాంకుల ఆదేశాల మేరకు స్థానిక ఉత్పత్తులపై, రైతాంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నప్పటికీ ఆహార పదార్థాల దిగుమతులపైనే ఆధారపడ్డారు. బంగ్లాదేశ్ పాలకవర్గాలు గత అనేక సంవత్సరాలుగా అనుసరిస్తూ వచ్చిన సామ్రాజ్యవాద అనుకూల, లొంగుబాటు ఆర్థిక విధానాలే ఈ పరిస్థితికి కారణం.

**తలకు మించిన భారంగా మారిన అతిపెద్ద విదేశీ ప్రాజెక్టులు :**

శ్రీలంక తరహాలోనే 'తెల్ల ఏనుగులు'గా పిలువబడే అనేక ప్రాజెక్టులను బంగ్లాదేశ్ చేపట్టింది. ఇందుకోసం స్థాయికి మించి అప్పులు చేసింది. వాటికి సాలీనా చెల్లించాల్సిన వడ్డీలు, కిస్తీల కోసం ప్రజలపై అదనంగా వేసే పన్నుల రూపంలో ప్రజలపై భారం పడుతూ ఉంది. ఉదాహరణకు 2400 మెగావాట్ కెపాసిటీ కలిగిన న్యూక్లియర్ పవర్ ప్రాజెక్టు కోసం 20 సంవత్సరాలలో తిరిగి తీర్చేలా అప్పు చేసింది. ఈ రుణానికి 565 మిలియన్ డాలర్లు ప్రతి సంవత్సరం చెల్లించాలి. 2024 నుంచి ప్రతి సంవత్సరం బంగ్లాదేశ్ 4 బిలియన్ డాలర్ల కిస్తీలు చెల్లించాల్సిన దుస్థితికి చేరింది. ప్రపంచ బ్యాంకు రుణాలు తీసుకుని వారి కండిషన్లు అమలు చేసే అన్ని దేశాల లాగే బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థ కూడా సంక్షోభం కొనే ఉంది.

కొసమెరుపు ఏంటంటే బంగ్లాదేశ్ ఆర్థిక పరిస్థితి గురించి ప్రపంచబ్యాంకు తెగ ఆందోళన పడిపోతోంది. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి, త్వరగా ఇప్పుడున్న నష్టాల నుంచి కోలుకోవడానికి సంస్థాగత సర్దుబాట్లు, కీలక ఆర్థిక సంస్కరణలు చేపట్టాల్సి ఉంటుందని సూచిస్తోంది. ఇందుకు తక్షణమే ఆదుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు పరిశీలకుల ద్వారా వర్తమానం పంపింది. ఈ ప్రపంచ బ్యాంకు ఆర్థికవేత్తలే దక్షిణాసియాలోని 8 దేశాల ఆర్థిక వ్యవస్థలను అధ్యయనం చేసి వాటికి కొన్ని పరిష్కారాలు చూపిస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇండియా, నేపాల్, శ్రీలంక, భూటాన్, మాల్దీవులే ఈ 8 దేశాలు.

**గ్రీనర్ ఎకానమీ :**

ఈ పేరు వినగానే ఎవరికైనా దృష్టి వ్యవసాయ రంగంపైకి పోతుంది. కానీ ప్రపంచ బ్యాంకు తన అప్పులు రాబట్టుకునే 'గ్రీన్ టాక్సేషన్' అనే కొత్త పన్నుల విధానాన్ని ఈ దేశాలలో చేపట్టాలని అలా వచ్చే ఆదాయం ద్వారా పెరిగేదే 'గ్రీనర్ ఎకానమీ' అని నిర్వచించింది. పై దేశాలలో ఇప్పటికే వున్న పన్నులకు అదనంగా గ్రీన్ టాక్సేషన్ కొనసాగించాలని సూచించింది.

**గ్రీన్ టాక్సేషన్ :**

దక్షిణాసియా దేశాలలో పర్యావరణానికి తీవ్రమైన హాని జరుగుతుందని, ఈ పర్యావరణానికి హాని కలిగించే ఉత్పత్తుల పైన ఒక క్రమపద్ధతిలో పన్నులు విధించే విధానానికే 'గ్రీన్ టాక్సేషన్' అని ముద్దుపేరు పెట్టింది. "దక్షిణాసియాలో ఆర్థిక వ్యవస్థల కేంద్రీకరణ, పునర్వ్యవస్థీకరణ పద్ధతులు – కొత్తదారి" అన్న ప్రపంచబ్యాంకు డాక్యుమెంటు ఈ విషయాలను స్పష్టపరుస్తున్నది. ప్రపంచ బ్యాంకు చీఫ్ ఎకనామిస్ట్ "దక్షిణాసియాలో గ్రీన్‌టాక్స్ ద్వారా ఇంధన భద్రత, పర్యావరణ అభివృద్ధి, రెవెన్యూ పెరుగుదల మొదలు ప్రయోజనాలు ఉంటాయి" అని సెలవిస్తున్నాడు.

ఇంకా ఆ రిపోర్టులో ఇలా వుంది "దక్షిణాసియాలో ఇప్పటికే ఆర్థిక అసమానతలు ఉన్నాయి. ఈ సంక్షోభ ప్రభావం వల్ల ఇంకా అనేక అసమానతలు పెరుగుతున్నాయి. అందులో జెండర్ అసమానతలు ప్రధానమైనవి. మహిళల జీవితాల పైన తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ అసమానతలు బద్దలవడానికి సిద్ధంగా ఉన్నాయి. యుద్ధానంతర పరిణామాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. ఈ పరిస్థితిలో గ్రీన్ టాక్సేషన్ ద్వారా ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టవచ్చు" అంటూ ప్రపంచబ్యాంకు రిపోర్టును ముందుకు తెచ్చింది.

గ్రీన్ టాక్సేషన్ అన్నది పర్యావరణాన్ని దారుణంగా విధ్వంసం చేస్తున్న పెట్టుబడిదారీ శక్తులు, బహుళజాతి కంపెనీలను వదిలేసి ప్రజలను బాధ్యులను చేసే విధానం. ఉదాహరణకు 15 సంవత్సరాల పైబడిన వాహనాలు రద్దు చేయటం; డీజిల్, పెట్రోల్ వాహనాల లైఫ్ టాక్స్‌లో గ్రీన్ టాక్స్ కలపడం; ప్లాస్టిక్ తదితర వస్తువులు అమ్మే వ్యాపారుల పైన

పన్నులు విపరీతంగా వేయడం ఈ విధానం ఉద్దేశ్యం. ప్రైవేటు అడవులు పెంచే బడా పరిశ్రమలకు రాయితీలు, మినహాయింపులు ఇవ్వడం; సామ్రాజ్యవాదుల కంపెనీల ఆస్తులకు, వారి లాభాలకు నష్టం వాటిల్లకుండా చూడటం; ఏదో ఒక రూపంలో ప్రజలను బాధ్యులను చేసి వారి నుంచి పన్నులు వసూలు చేయడమే పాలకుల అసలు లక్ష్యం. బంగ్లాదేశ్‌తో పాటు దక్షిణాసియాలో ఉన్న దేశాలలో వ్యవసాయ రంగాన్ని పనిగట్టుకుని ధ్వంసం చేయటం, గిట్టుబాటు కాకుండా చేయటం ఎందుకు జరిగింది? పారిశ్రామిక అభివృద్ధి పేరుతో లక్షల ఎకరాల భూములను ఉచితంగానే పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతూ పర్యావరణ అసమతుల్యతను పెంచుతున్నది ఎవరు? దక్షిణాసియాలోకి చొరబడుతున్న ఫైనాన్స్ పెట్టుబడులు, బహుళజాతి కంపెనీలు. వీటి కోసమే పనిచేస్తూ వీరి లాభాలకు గ్యారెంటీ ఇచ్చే దళారీ శక్తులు. అన్నింటికీ నిర్వహణలో సహకరించే ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ వంటి ఆర్థిక సంస్థలే ఇందుకు బాధ్యులు. దక్షిణాసియా దేశాలకు పెద్దన్నగా భారతదేశాన్ని చూపుతూ భారత పాలకులను తమ కనుసైగలతో కంట్రోల్ చేసస్తూ వ్యాపార సామ్రాజ్యం తమ చేతులు దాటిపోకుండా చూసుకోవటం సామ్రాజ్యవాదుల పన్నాగం. దక్షిణాసియా దేశాల పీడిత ప్రజలు, దేశభక్తి పరులు ఈ విపత్కర పరిణామాలను గమనిస్తున్నారు. ఎదుర్కొంటున్నారు. శ్రీలంకలో ఇన్ని కష్టాల మధ్య కూడా 'ఆదానీ గో బ్యాక్' అంటూ రోడ్డెక్కారు. అదే విధంగా మిగిలిన దేశాల ప్రజలు కూడా తమ దేశాలను సామ్రాజ్యవాద దోపిడి నుంచి, స్థానిక దళారీ శక్తుల ద్రోహపూరిత విధానాల నుంచి కాపాడుకుంటారు.

*****